నీరుగారిన జల్ పథకాలు



ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ పథకాలు భీమిలి మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణ దశలోనే నీరుగారిపోతున్నాయి. ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, కాంట్రాక్టర్లకు మధ్య సమన్వయలోపం గ్రామస్తులకు శాపంగా మారింది. ఫలితంగా చలి కాలంలోనూ గ్రామాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. ఇక వేసవిలో పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు.



మజ్జివలస ఎస్సీ కాలనీలో పూర్తి కాని వాటర్ ట్యాంకు నిర్మాణం



లక్ష్మీపురంలో నిలిచిపోయిన వాటర్ ట్యాంకు పనులు

- అర్ధంతరంగా నిలిచిన ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం
- అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయలోపం
- గుక్కెడు నీటికీ గ్రామస్తుల అవస్థలు

తగరపువలస: జల్‌జీవన్ మిషన్ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో భీమిలి మండలంలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని సగం పంచాయతీలలో పనులు పూర్తయినా పైపులైన్ల కోసం తవ్విన రహదారులు వెక్కిరిస్తున్నాయి. దీంతో వర్షం పడితే ఆయా గ్రామాలు చెరువులుగా మారిపోతున్నాయి. మరికొన్ని గ్రామాలలో ట్యాంకు, పైపులైన్లు నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. గతంలో ఇక్కడ పని చేసిన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య పొసగకపోవడంతోనే ఏళ్ల తరబడి వీటికి పరిష్కారం దొరకలేదు. పాక్షికంగా ట్యాంకు నిర్మాణాలు, ఎక్కడపడితే అక్కడ వదిలేసిన పైపులు, పైపులైన్ నిర్మాణం కోసం తవ్వేసిన గోతులు కనిపిస్తున్నాయి. ఫలితంగా తీవ్రమైన చలికాలంలోనే గ్రామాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. ఇటీవల బదిలీపై వచ్చిన అధికారులైనా చొరవ తీసుకుని పూర్తి చేయగలిగితే రానున్న వేసవినాటికైనా తాగునీరు సమస్య పరిష్కారమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మజ్జివలసలో..

మజ్జివలస పంచాయతీలో ట్యాంకు, పైపులైన్ కోసం మూడేళ్ల క్రితమే రూ.58 లక్షలు మంజూరు కాగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. పంప్‌హౌస్ నుంచి కనెక్షన్ ఇవ్వడానికే రెండేళ్ల సమయం తీసుకోవడంతో ప్రస్తుతం ఎస్సీ కాలనీలో తాగునీరు సమస్య ఉంది.

‘లక్ష్మీపురం’లో అసంపూర్తిగా..



లక్ష్మీపురంలో వృథాగా పడి ఉన్న పైపులు

భీమిలి మండంలోని లక్ష్మీపురం పంచాయతీకి జల్‌జీవన్ పథకానికి గాను రూ.54 లక్షలు మంజూరయ్యాయి. శ్రీకాకుళానికి చెందిన కాంట్రాక్టర్ పాక్షికంగా ట్యాంకు నిర్మించి, పైపులు గ్రామంలో పడేసి వెళ్లిపోయారు. ఇదే పంచాయతీలో విజయరాంపురం గ్రామానికి ట్యాంకు మరమ్మతులు, పైపులైన్‌కు రూ.21 లక్షలు మంజూరైనా గతంలో అధికారులు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించకపోవడంతో అంగుళం పనులు కూడా జరగలేదు. ఇటీవల ఈ గ్రామంలో శిథిలమైన వాటర్ ట్యాంకుపై నుంచి ప్రమాదవశాత్తూ పడి ఒకరు మరణించారు. ప్రస్తుతం ఈ పంచాయతీలో వెయ్యి మంది ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

‘తవ్వి’ వదిలేశారు

జల్‌జీవన్ పథకాల కోసం గ్రామాల్లో తవ్విన రహదారులకు మరమ్మతులు చేయాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. గోతులు పూడ్చకపోవడంతో ఎగుడుదిగుడుగా మారి నడవలేకపోతున్నారు. మండలంలో నారాయణరాజుపేట, చిప్పాడ, శింగనబంద, మజ్జివలస, లక్ష్మీపురం, అమనాం, మజ్జిపేట తదితర గ్రామాలలో ఈ ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇటీవల వర్షాలకు ఈ గ్రామాలు చెరువులను తలపించాయి. ప్రస్తుతం ధనుర్మాసం ప్రారంభమైనందున ఇళ్లకు మరమ్మతులు చేయించే పనులు ప్రారంభమవుతున్నాయి. జల్‌జీవన్ పథకం కింద పనులు చేపట్టిన గ్రామాలలో సంక్రాంతి నాటికి రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



నారాయణరాజుపేటలో పైపులైన్ కోసం తవ్వేసిన రహదారి

మిగిలిన పనులు పూర్తి చేయాలి



మజ్జివలస ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణం పూర్తయింది. కనెక్షన్ ఇవ్వాలి. ఇంకా పదిశాతం మాత్రమే పనులున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సాయంతో కాంట్రాక్టర్‌కు కబురు పెట్టాం. త్వరలో పూర్తి చేస్తామన్నారు.

– తుపాకుల అప్పలరాజు, మజ్జివలస

కాంట్రాక్టర్ ప్రారంభంలోనే వదిలేశారు



లక్ష్మీపురంలో కాంట్రాక్ట్ తీసుకున్న శ్రీకాకుళానికి చెందిన వ్యక్తి పాక్షికంగా ట్యాంకు నిర్మాణం చేపట్టి, పైపులు వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వాటికి కాపలా కాయవలసి వస్తోంది. విజయరాంపురంలో ఇప్పటి వరకు అధికారులు కాంట్రాక్టరుకు పనులు అప్పగించలేదు. కరగానిపేటలో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

– బోని బంగారునాయుడు, వైస్ ఎంపీపీ, భీమిలి మండలం

కాంట్రాక్టర్లను పిలిపిస్తున్నాం

గతంలో ఎక్కడైతే జల్‌జీవన్ పథకాల పనులు ప్రారంభించి వివిధ కారణాలతో నిలిపివేశారో ఆయా కాంట్రాక్టర్లను పిలిపిస్తున్నాం. ఎవరు పనులు ప్రారంభించారో వారే పూర్తి చేయాలి. ఈ ఏడాది సెప్టెంబరు వరకు బిల్లులు కూడా మంజూరు కాలేదు. ప్రారంభించిన అన్ని పథకాలు పూర్తి చేస్తాం.

– పి.ఈశ్వరీబాయి, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

క్లుప్తంగా

చిట్టివలసలో అన్నదానం



చిట్టివలసలో అన్నదానం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలసలో కేజీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. చిట్టివలస, తగరపువలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు రెండో వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్, సభ్యులు, పురుషోత్తం, సూర్య, మాజీ కౌన్సిలర్లు చిలకా నరసింగరావు, పిట్ట వెంకటరావు, స్థానిక పెద్దలు పాల్గొని గురునాయుడు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఏపీ నిట్‌తో అనిట్స్ ఎంవోయూ



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న అనిట్స్, నిట్ ప్రతినిధులు

తగరపువలస: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆంధ్రప్రదేశ్)తో సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అనిట్స్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో అనిట్స్ ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ, ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వీ రమణరావు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ తమ విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చుకోవడంలో భాగంగానే నిట్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. విద్యార్థుల పరిశోధనలు, ప్రాజెక్టులలో కలిసి పనిచేయడానికి, ఇంటర్న్‌షిప్ చేయడానికి ఈ ఎంవోయూ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అనిట్స్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి జె.విజయకుమార్, నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర రెడ్డి, డీన్‌లు జి.ఆర్.కె.శాస్త్రి, టి.కురుమయ్య, ఎన్.జయరామ్, జీబీ వీరేష్‌కుమార్, వి.సందీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ

పద్మనాభం: లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీ) థీమ్స్‌పై అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17, 18 తేదీల్లో శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు పోటీలు

మధురవాడ: ఇంధన పొదుపు–ఆవశ్యకతపై మారికవలసలోని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఇంధన పొదుపు, భవిష్యత్ అవసరాలు, పొదుపులో చిట్కాల గురించి ఈఈ విద్యార్థులకు వివరించారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమలైకి మాలధారులు

మధురవాడ: అయ్యప్ప సన్నిధికి మాలధారులు పయనమయ్యారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షధారులు 41రోజులు స్వామి దీక్ష పూర్తి చేసి సోమవారం శబరిమలైకి బయల్దేరారు. ఆలయంలో గురుస్వామి పిల్లా వెంకటరమణ ఆధ్వర్యంలో ఇరుముడి ధారణ చేసి, స్వామి దర్శనానికి పయనమయ్యారు.

శివశక్తినగర్‌లో వైన్‌షాపు వద్దు

- పీజీఆర్ఎస్‌లో మహిళల వినతి
- జోన్–2 లో 12 అర్జీలు



వైన్ షాపు ఏర్పాటు చేస్తే తలెత్తే ఇబ్బందులను జోన్–2 ఇన్‌చార్జి జెడ్సీకి వివరిస్తున్న మహిళలు



జోన్–1 జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణికి వినతి పత్రం అందిస్తున్న భీమిలి ప్రెస్‌క్లబ్, ఫ్యాబ్ సభ్యులు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ సమీపంలోని శివశక్తి నగర్ రోడ్డులో వైన్ షాపు ఏర్పాటు చేస్తే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ జోన్–2 మధురవాడ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాంకు వైన్‌షాప్ ఏర్పాటు వల్ల ఎదురయ్యే సమస్యలు తెలియజేశారు. మహిళలకు, పిల్లలకు రక్షణ కరువవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఐద్వా నాయకురాలు భారతి, టీకే శారద జెడ్సీకి వినతిపత్రం అందజేశారు. పీజీఆర్ఎస్‌కు జోన్ పరిధిలోని 9 వార్డుల్లో పలు ప్రాంతాల నుంచి 12 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

- టీచర్స్ లేవుట్, అయ్యప్పనగర్ 3వ లైన్, కొమ్మాది ముత్యాలమ్మ కాలనీ పోల్ నెంబర్ 433/ఏ–12/1 తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.
- కార్ షెడ్ జంక్షన్ సమీపంలో శ్రీనివాస ప్యారడైజ్, ఏకే గ్రాండ్ ఎదురుగా ఓ భవనాన్ని ప్లాన్, సెట్ బ్యాక్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని, చర్యలు చేపట్టాలని శాంతి వినతి పత్రం సమర్పించారు.
- పిలకవానిపాలెం లివింగ్ లైన్ ఎదురుగా ఉన్న గ్రావెల్ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని పి.కాంతారావు కోరారు.
- పీఎం పాలెం 2వ బస్టాప్ వద్ద 45వ వార్డు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పార్కులో సరైన వసతులు లేవని సుగర్ ఫ్యాక్టరీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కాశీప్రసాదరావు ఫిర్యాదు ఇచ్చారు. పార్కులో లైట్లు వెలగడం లేదని, అభివృద్ధి పనులు పూర్తి చేయలేదని, కనీసం వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట వస్తువులు కూడా లేవని పేర్కొన్నారు.

జోన్–1లో ఆక్రమణల తొలగింపునకు వినతి

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువైపోతున్నాయని, వాటిని తొలగించాలని భీమిలి ప్రెస్ క్లబ్, ఫ్రెండ్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్), పీపుల్ పవర్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణిని కోరారు. ఈ మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని అందించారు. మెయిన్‌రోడ్డు గంటస్తంభం వద్ద కూడా ఆక్రమణలు ఎక్కువగా ఉండడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. దీనిపై జెడ్సీ స్పందిస్తూ, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి అడిదం కిశోర్, ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, పీపుల్ పవర్ అధ్యక్షుడు నిమ్మకాయల భాస్కర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

‘కూటమి’ పాలనలో ప్రజలపై పెరిగిన భారం



విద్యుత్ చార్జీల పెంపుపై నిరసిస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారాలు ఎక్కువయ్యాయని సీపీఎం నాయకులు ఎస్.అప్పలనాయుడు, ఎస్.నాగరాణి పేర్కొన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో పాటు ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి కోలుకోలేని దెబ్బ తీశారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు, స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఆనందపురం కూడలిలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పెంచిన చార్జీలు, స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఠాకార్మికులు శివశంకర్, బంగారునాయుడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పర్యవేక్షణతో యంత్రాల పనితీరు మెరుగు



ప్రసంగిస్తున్న అసోసియేట్ డైరెక్టర్ డా.గణేష్ కుమార్

కొమ్మాది: పారిశ్రామిక రంగంపై కృత్రిమ మేధస్సు రానున్న రోజుల్లో గణనీయమైన ప్రభావం చూపుతుందని కండీషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డా.గణేష్ కుమార్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కండీషన్ మానిటరింగ్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. యంత్రాల దీర్ఘకాలిక పని తీరును మెరుగుపరచడానికి కండీషన్ మానిటరింగ్ అవసరమన్నారు. పరిశ్రమల్లోని విభాగాలను డిజిటలైజ్ చేయడం ద్వారా ఆయా విభాగాల్లో యంత్రాల పనితీరుపై రోజువారీ సమాచారం లభిస్తుందని, ఆ డేటాను విశ్లేషించడం ద్వారా రాబోవు ప్రమాదాలను ముందుగానే గుర్తించి, యంత్రాలకు మరమ్మతులు చేయవచ్చన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

- శ్రీవారి సన్నిధిలో మోగిన నెలగంట
- భక్తిశ్రద్ధలతో తిరుప్పావై నివేదన



రుషికొండలోని శ్రీవారి ఆలయంలో ధనుర్మాస గంటను మోగిస్తున్న అర్చకుడు



కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద నెల గంట కొడుతున్న అర్చకులు

కొమ్మాది: ఆలయాల్లో నెలగంట మోగింది. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు సోమవారం కనులపండువగా మొదలయ్యాయి. రుషికొండలో టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై పఠనం ప్రారంభించినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుస్సంక్రమణం ప్రారంభమైందని, వచ్చే నెల 14వ తేదీ వరకు రోజూ ప్రత్యేక పూజలు ఉంటాయని తెలియజేశారు. ఈ నెలరోజుల పాటు రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 6 గంటల వరకు తిరుప్పావై, 6 గంటల నుంచి 6.30 వరకు శుద్ధి, తోమాల, ధనుర్మాస ఆరాధన గంట, 6.30 గంటల నుంచి 7.30 వరకు ధనుర్మాస విశేష దర్శనం, 7.30 నుంచి 8.30 వరకు శుద్ధి, తోమాల, అర్చన, ఉదయం 8.30 గంటల నుండి 9 గంటల వరకు మొదటి గంట, 9 నుండి సర్వదర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. తిరుప్పావై సేవలో పాల్గొనేందుకు టిక్కెట్ ధర ఒకరికి రూ. 100 ఉంటుందని తెలిపారు.

అష్టలక్ష్మి సన్నిధిలో..

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధనుర్మాస వ్రతం నిర్వహించి, గోదా దేవిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చనలు చేశారు. భక్తులు సామూహికంగా తిరుప్పావై పాశురాలు పఠించారు. ధనుర్మాసమంతా రోజూ తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

కుంతీమాధవ స్వామి ఆలయంలో..

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా వేకువజామున మేలుకొలుపు, నగర సంకీర్తన నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, గోదా దేవి విగ్రహాలను వేరు వేరుగా పల్లకీలో ఉంచి బేడా సేవా జరిపించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు అర్చక స్వామి పదస్ నెల గంట మోగించడంతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు కుంతీ మాధవ స్వామి ఆలయంలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిలో ఆశీనులైన గోదా దేవిని దర్శించుకుని పూజలు చేశారు. భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభ స్వామి, తాలాడ పైడిరాజు, తాలాడ నరసింహనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా మహాసన్నిధాన పూజ



సన్నిధాన పూజలో పాల్గొన్న మాలధారులు



ఆకట్టుకున్న అయ్యప్ప ఆలయ నమూనా

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మహా సన్నిధాన పూజా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయ నమూనా అందరినీ ఆకట్టుకుంది. రాజమాతంగి పీఠానికి చెందిన శ్యామలానంద స్వామి ప్రత్యేక పూజలు, శాంతి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నర్సింగరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణ, దాడులపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం గ్రామ పంచాయతీ సర్వే నంబర్ 260/1లో తమకు చెందిన 0.74 సెంట్ల స్థలంలో జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని కోరుతూ సుంకరి అప్పల రాములమ్మ ఆనందపురం పోలీసులతో పాటు నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పలనాయుడు అనే వ్యక్తి మరో 20 మందితో కలిసి దాడులు చేస్తూ, ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్రత్యర్థుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించడంతో పాటు తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఈ మేరకు ఈ నెల 11, 12,14 తేదీల్లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

జాతీయ రహదారిలో చిమ్మచీకట్లు

నెలల తరబడి వెలగని వీధిదీపాలు

మధురవాడ: నియోజకవర్గ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అంధకారమే అలముకుంది. జాతీయ రహదారిపై కూడా వీధిలైట్లు వెలగక చిమ్మచీకటే రాజ్యమేలుతోంది. జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడ క్రికెట్ స్టేడియం నుంచి బోయిపాలెం వరకు ఉన్న జాతీయ రహదారిలోనూ సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. చంద్రంపాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, పరదేశిపాలెం తదితర ప్రాంతాల్లో వీధులు, నివాస ప్రాంతాలల్లోనే కాదు, ప్రధాన రహదారులు, జాతీయ రహదారిలో కూడా లైట్లు వెలగడం లేదు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లోనూ తరచూ ఇవే 30శాతం పైన ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా అధికార యంత్రాంగంలో చలనం లేదు. ప్రధాన రహదారుల్లో చీకటి కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఉన్నత స్థాయి అధికారులైనా తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పరదేశిపాలెం వద్ద హైవేలో వెలగని సెంట్రల్ లైటింగ్